క్లుప్తంగా

మైండ్ మ్యాపింగ్‌లో ఆరాధ్య ప్రతిభ


మైండ్ మ్యాపింగ్‌లో ప్రతిభ చూపిన ఆరాధ్య

పరవాడ: మండలంలోని భర్నికం శివారు బాపడుపాలెం ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న ఆరాధ్య ఆంగ్ల వర్ణమాల ఎ నుంచి జెడ్ వరకు చూపిన మైండ్ మ్యాపింగ్ ప్రతిభను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ప్రశంసించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఆ వీడియోను షేర్ చేశారు. విద్యార్థిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు కె.గంగాధర్‌రావును మంత్రి లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు.

పీఏసీఎస్ చైర్మన్ అయితకు సన్మానం


అయిత సింహాచలంను సత్కరిస్తున్న యదువంశీ యాదవ సంఘం ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) చైర్మన్‌గా నియమితులైన అయిత సింహాచలంను పెందుర్తి యదువంశీ యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. చినముషిడివాడలోని సింహాచలం నివాసంలో ఆయనకు దుశ్శాలువా కప్పి జ్ఞాపిక అందించి అభినందించారు. ముందుగా పలు అంశాలపై చర్చించారు. సంఘం ప్రతినిధులు చందక చలపతిరావు, ఉప్పిలి కనకరాజు, కాయిత ఎర్రిబాబు, అయిత ఎర్రిబాబు, పీతల విష్ణు, మామిడి దుర్గాప్రసాద్, గొలగాని సంతోష్, సారిపల్లి బీమేష్ తదితరులు పాల్గొన్నారు.

అలివేలు మంగమ్మకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో కొలువుదీరిన అలివేలు మంగమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణిబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం అలంకరణ చేసి, సామూహిక కుంకుమ పూజలు జరిపారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి పంపిణీ


పుస్తకాలు అందిస్తున్న జేసీబీ ప్రసాద్

పెందుర్తి: స్థానిక అక్షర భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రెండో రోజు స్టేషనరీ సామగ్రి పంపిణీ కొనసాగింది. ట్రస్ట్ వ్యవస్థాపకుడు నెల్లూరు ప్రసాద్(జేసీబీ ప్రసాద్) తన సొంత నిధులతో పెందుర్తి మండలంలోని 30 మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు దేవరాపల్లిలోని 4 పాఠశాలల్లోని 3,300 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, అట్టలు, పెన్సిళ్లు, రబ్బర్లు, షార్ప్‌నర్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు ప్రసాద్ మాట్లాడుతూ అక్షర భారతి ట్రస్ట్ సేవలు భవిష్యత్‌లో మరింత విస్తృతం చేస్తామన్నారు. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన మండలంలోని పదో తరగతి ర్యాంకర్లకు నగదు పురస్కారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన


చీమలాపల్లిలోని టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న అజయ్‌కుమార్, ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో ఉన్న టిడ్కో ఇళ్లను టిడ్కో హౌసింగ్ చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. త్వరితగతిన ఇళ్లను అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, జెడ్పీ హేమావతి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ముమ్మన దూరం దూరం: కూటమి ప్రభుత్వంలో విబేధాలు లేవంటూనే జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు కయ్యాలు మానుకోవడం లేదు. బీజేపీలో చేరిన 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడును టిడ్కో చైర్మన్ పర్యటనకు జనసేన పార్టీ దూరంగా ఉంచింది. ఆయన వార్డులోనే చైర్మన్ పర్యటించినా ఆ కార్పొరేటర్‌కే వేదిక మీద స్థానం లేకుండా పోయింది. మా బంధానికి ఢోకా లేదంటూ డాంభికాలు పలుకుతున్న కూటమి పెద్దల మాటలు కేవలం డబ్బా కబుర్లేనని తాజా కార్యక్రమంలో మరోసారి తేటతెల్లమైంది.


రావాడలో వేసిన వరి నారుమడులు

సాయం అందక.. సాగు ధీమా లేక!

కూటమి ప్రభుత్వంలో పెట్టుబడి సాయం అందక పరవాడ మండలంలోని అన్నదాత కుదేలవుతున్నాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా 5,399 మంది రైతులకు రూ.6.50 కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.32.50 కోట్ల లబ్ధి చేకూరింది. గత ఖరీఫ్ సీజన్‌లో మొండి చేయి చూపిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కూడా అదే బాట నడుస్తోంది. దీంతో రైతు సాగు ధీమాలేక ఆందోళన చెందుతున్నాడు.

- అన్నదాత సుఖీభవ కోసం రైతుల నిరీక్షణ
- అప్పులు చేసి మరీ ఆకు మడులు సిద్ధం
- కరుణించని వరుణుడు, కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఠంచనుగా పెట్టుబడి సాయం

పరవాడ: మండలంలో అత్యధిక మందికి ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఏటా మండలంలో ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా వరి, కూరగాయలు, అపరాలు, గంట్లు సాగు చేస్తుంటారు. గతేడాది కూడా కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించలేదు. కనీసం ఈ ఏడాదైనా సకాలంలో అన్నదాత సుఖీభవ పథకం అందుతుందని ఆశించిన రైతాంగానికి ప్రభుత్వం ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తుండడంతో దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.


వర్షాలు లేక దుక్కులు చేయని వరి పొలాలు

ఊసులో లేని 'యాంత్రీకరణ'

2025 ఏడాదికి వ్యవసాయ యాంత్రీకరణ పథకం విధి విధానాలు ప్రభుత్వం నుంచి వ్యవసాయ కార్యాలయాలకు చేరలేదు. గత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పనిముట్లను సకాలంలో అందించేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హుల జాబితాను సిద్ధం చేసి సచివాలయాల్లో ప్రదర్శనకు ఉంచడంతో సరిపెట్టేశారు. సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పనిముట్లను అందించేదని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తలేదని, వాటి కోసం బయట మార్కెట్‌లో అధిక రేట్లు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

మండలంలో పంటల సాగు

పంట రకం	విస్తీర్ణం (ఎకరాల్లో)
వరి	340
అపరాలు	95
కాయగూరలు	360
గంట్లు	250

జగన్ పాలనలో రైతుకు ధీమా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు.రైతు భరోసా పథకం కింద ఏడాదికి మూడు విడతలుగా పెట్టుబడి సాయాన్ని అప్పటి జగన్ ప్రభుత్వం అందించేది. మండలంలో 5,399 మంది రైతులకు ఏడాదికి రూ.6.50 కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.32.50 కోట్ల లబ్ధి చేకూర్చింది. దీంతో సాగుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పెట్టుబడి సాయం అతీగతీ లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం పేరిట ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తామని హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పెట్టుబడి సాయం ఊసేలేదని రైతాంగం పెదవి విరుస్తోంది.

ఆకు మడుల కోసం అప్పులు

ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు అప్పులు మరీ ఖరీఫ్ వరికి ఆకు మడులు సిద్ధం చేశారు. మళ్లీ వర్షాలు పడితే నాట్లు వేయడానికి సన్నాహాలు చేసుకోవాలి. అన్నదాత సుఖీభవ పథకం చేతికి అందక పోవడంతో ట్రాక్టర్లను అద్దెకు తెచ్చుకోలేక పలు గ్రామాల్లో వరి నాట్లు వేసే పంట పొలాలను దుక్కులు చేయకుండా వదిలేశారు. రాయితీపై పచ్చిరొట్ట, వరి విత్తనాలు అందించి చేతులు దులిపేసుకున్నారని రైతాంగం ఆక్షేపిస్తోంది.

పెట్టుబడి సాయం కోసం నిరీక్షణ



ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిపోయింది. అయినా పథకం అమలుకు నోచుకోలేదు. ఖరీఫ్ పంటల సాగు కోసం బయట అప్పులు చేయాల్సి వస్తోంది. అర్హుల జాబితాలో పేర్లు చూసుకుని మురిసిపోవడం తప్ప ఇప్పటి వరకు దానిపై ఎలాంటి సమాచారం లేదు. వెంటనే పథకం లబ్ధి రైతులకు అందించాలి.

– రాజాన పైడింనాయుడు, పాతరాజన్నపాలెం

జగన్ ప్రభుత్వంలో ముందుగానే సాయం



రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బంది పడకుండా జగన్ ప్రభుత్వంలో ముందుగానే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమయ్యేది. టార్పాలిన్లు, స్ప్రేయర్లు అందించేది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా అటువంటివేవీ అందలేదు. అన్నదాత సుఖీభవ పథకం ఊసే లేదు. ఇటీవలి వర్షాలకు వరి ఆకుమడులు సిద్ధం చేశాం. పెట్టుబడి సాయం కోసం చూస్తున్నాం.

– రేఖ వెంకటరావు, రావాడ

ప్రభుత్వ ఆదేశాలు రాలేదు



2025 ఏడాది అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఈ ఏడాది పథకానికి మండలంలో 4,575 మంది అర్హత సాధించారు. ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి విత్తనాలు 151 క్వింటాళ్లు, పచ్చి రొట్ట విత్తనాలు 22 క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేశాం.

– మొల్లి రమాదేవి, వ్యవసాయాధికారి, పరవాడ

బదిలీ ఉపాధ్యాయులకు ఆత్మీయ సత్కారం


సత్కారం అందుకున్న ఉపాధ్యాయ బృందం

పరవాడ: విద్యార్థుల మనసుల్లో చోటు సంపాదించుకున్న ఉపాధ్యాయులు ధన్యులని వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్ లెక్కల సన్యాసి, హెచ్ఎం ఎన్.శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల బదిలీల్లో పాఠశాల నుంచి ఇతర పాఠశాలలకు బదిలీ అయిన హెచ్ఎం పందిరి కనకేశ్వరరావు, ఉపాధ్యాయులు విక్టోరియా ఫ్రాన్సిస్, బుద్ధ రమేష్ బాబు, సంపతిరావు, కూర్మారావు, బి.సంజీవరావు, వల్లి అప్పలనాయుడు, ఎస్.ఎస్.రెడ్డి, ఎం.ఇందిర, వరలక్ష్మి, పి.ఉమాదేవి, ఎస్.సుజాతరాణి, బి.అన్నాజీరావులను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. అనంతరం సన్యాసి మాట్లాడుతూ పాఠశాలలో పనిచేసి విద్యార్థులు, తల్లిదండ్రుల ఆదరాభిమానాలు చూరగొన్న ఉపాధ్యాయుల సేవలు మరువలేనివన్నారు. పాఠశాల పూర్వ హెచ్ఎం కనకేశ్వరరావు మాట్లాడుతూ రెండేళ్ల పదవీ కాలంలో ఉపాధ్యాయులు, గ్రామ ప్రజల సహకారం ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్, సౌజన్య, అరుణ, జ్యోతి, కామేశ్వరి, అప్పలరాజు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి


బి.నాగరాజు, తహసీల్దార్, పరవాడ

పరవాడ: అందరి సహకారంతో మండలంలో అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పరవాడ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన బి.నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కరించే దిశగా పనిచేస్తానన్నారు. ముఖ్యంగా మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపడతానన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ కట్టడాలకు పూనుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూముల దురాక్రమణ, అక్రమ కట్టడాలపై రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేసి వివరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ బంజరు భూములు, కొండ ప్రదేశాలు, చెరువులు, వాగులు, కాలువల్లో అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపితే గనులు, భూగర్భశాఖ సమన్వయంతో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ పరమైన సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని చెప్పారు.

పేదలపై కూటమి ప్రభుత్వం దండయాత్ర

- ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట రూ.15,486 కోట్ల భారం
- స్మార్ట్ మీటర్లు అమర్చితే తరిమికొట్టండి.. అన్న లోకేష్‌ను ఇప్పుడేం చేయాలి
- వేపగుంటలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఐ ఆందోళన



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పెందుర్తి: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం సామాన్య, నిరుపేద వర్గాలపై దండయాత్ర చేస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసరావు ఆక్షేపించారు. ఏడాది పాలనలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.15,486 కోట్ల భారాన్ని వేసిందని మండిపడ్డారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిరసనగా వేపగుంట కూడలి వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలను అడ్డంగా దోచుకోవడానికే ఈ స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై ఆదానీ కంపెనీతో తప్పుడు ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చితే తరిమి కొట్టండి అని చెప్పిన మంత్రి లోకేష్‌ను ఇప్పుడేం చేయాలని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, ఉన్నవాటిని తగ్గిస్తామని తప్పుడు ప్రకటనలు చేసిన కూటమి పెద్దలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇప్పుడు ప్రజలను దారుణంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ మిత్రుడైన అదానీ ప్రాపకం కోసం అతని కంపెనీలకు లాభాలు అందించేందుకు ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నారని ఆరోపించారు. తాజాగా కూటమి ప్రభుత్వ స్మార్ట్ మీటర్ల నిర్ణయం వలన ప్రజలపై రూ.వేల కోట్ల భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వలన ప్రజల నుంచి వసూలు చేసే చార్జీలకు అంతు లేకుండా పోతుందన్నారు. ప్రీపెయిడ్ రీచార్జి అయిపోతే ఆ రోజు ఆ ఇంట్లో విద్యుత్ లేనట్లేనని పేర్కొన్నారు. ఏ రకంగా చూసుకున్నా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రజలకు తీవ్ర నష్టమే ఏర్పడుతుందని, తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, కార్యకర్తలు, ప్రజలు, పలువురు చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

ఉచిత థైలేరియా టీకాలు

సబ్బవరం: పాడి రైతులంతా 3 నెలలు వయసు దాటిన తమ సంకరజాతి పశువులన్నింటికీ థైలేరియా టీకాలు తప్పనిసరిగా వేయించాలని సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ వి.చిట్టినాయుడు సూచించారు. మండలంలోని అమృతపురం, బొండవానిపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన థైలేరియా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆరిపాక పశువైద్యాధికారి డాక్టర్ స్వర్ణలత, అంతకాపల్లి పశువైద్యాధికారి డాక్టర్ అరుణ, ఓటివాడ జేవీవో వెంకట రమణ, పశుసంవర్ధక సహాయకులు వెంకటరావు, అప్పలరాజు, లక్ష్మణ పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం


కంటి అద్దాలు, మందుల కిట్‌లను రోగులకు అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు పరిధి నాయుడుతోటలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శుక్రవారం సందర్శించారు. నర్సీపట్నం నుంచి ఇటీవల 22 మంది కంటి శస్త్రచికిత్సలు ఆస్పత్రిలో చేయించుకున్నారు. వారిని కలిసిన స్పీకర్ వారికి శంకర్ ఫౌండేషన్ ద్వారా కంటి అద్దాలు, మందుల కిట్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న ఉచిత సేవలను కొనియాడారు. మారుమూల ప్రాంతాల్లో క్యాంపులు నిర్వహించి, కంటి సమస్యలతో బాధపడుతున్నవారిని గుర్తించి, ఆస్పత్రికి తీసుకొచ్చి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయడం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా 1997 నుంచి ఇప్పటి వరకు శంకర్ ఫౌండేషన్ సాధించిన ప్రగతిని ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్ వివరించారు. వైద్యులు రవీంద్ర, నజరిన్, శిరీష, కృష్ణ, డీజీఎంలు బంగార్రాజు, రమేష్‌కుమార్, వేణుగోపాల్, ఏజీఎం కనకరాజు పాల్గొన్నారు.

'ఉపాధి' కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి


మడకపాలెంలో ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ కార్మికులు

పరవాడ: ఉపాధిహామీ కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించి, ఆదుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మడకపాలెంలో పని ప్రదేశంలో బకాయి వేతనాల కోసం కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు 8 వారాలుగా వేతనాలు చెల్లించకపోవడంతో, కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు పని ప్రదేశంలో కల్పించాల్సిన కనీస సదుపాయాలను కల్పించట్లేదని ఆక్షేపించారు. ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లైవ్ ఆడిట్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీలను వేధింపులకు గురి చేయడం మానుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు ప్రతి వారం వేతనాలు చెల్లించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో అమ్మాజీ, భవాని, ధనలక్ష్మి, రాశి, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

సింహవల్లీ తాయారుకు తిరువీధి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువైన సింహవల్లీ తాయారు అమ్మవారికి శుక్రవారం విశేషంగా తిరువీధి జరిగింది. సింహవల్లీ తాయారు, సువర్ణ అమ్మవారి ఉత్సవ మూర్తులను పల్లకిలో వేంజేపచేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. విశేష హారతులు అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.